ప్రజాశక్తి

బుధవారం 23 జూలై 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

స్మార్ట్ మీటర్లను తిరస్కరించండి

◆ కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం పిలుపు

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇళ్లకు బిగిస్తున్న అదానీ విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని విశాఖ జిల్లా కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రజలకు పిలుపు నిచ్చింది. వేదిక రౌండ్‌టేబుల్ సమావేశం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో విశాఖ జిల్లా కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడారు. అదానీ లాభాల కోసం మోడీ ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల బిగింపునకు పూనుకుందని, విద్యుత్తును సంపూర్ణంగా ప్రైవేటీకరించే కుట్ర అందులో దాగి ఉందని అన్నారు. అదానీ స్మార్ట్ మీటర్లు బిగించిన షాపులకు భారీగా బిల్లులు వస్తున్నాయన్నారు. దుకాణదారులు తీవ్ర ఆందోళనలో వున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పుడు ప్రజల ఇళ్లకు స్మార్ట్ మీటర్లను బిగించడానికి మిగతా 2లో..

నేటి నుంచి ఆందోళనలు

ఈ నెల 23 నుంచి 28 వరకు జోన్లు, మండలాలవారీ రౌండ్‌టేబుల్ సమావేశాలు, సెమినార్లు నిర్వహించాలి. 29న విశాఖ జిల్లా సదస్సు, 30 నుండి ఆగస్టు 1 వరకూ కాలనీలవారీ సమావేశాలు, ప్రదర్శనలు చేపట్టాలి. ఆగస్టు 2న జిల్లాలోని అన్ని విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసనలు తెలపాలి. 5న ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి ఆఫీస్ వద్ద మహాధర్నా నిర్వహించాలి' అని రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

స్టీల్‌ప్లాంట్‌లోని యూనిట్లను పరిశీలిస్తున్న మంత్రి టిజి.భరత్

ఉక్కును లాభాల్లోకి తెచ్చేందుకు కృషి చేయండి

స్టీల్‌ప్లాంట్ సందర్శనలో మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి – ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని, ఈ ఏడాది జూలై నాటికి ఆపరేషన్‌లో ఉన్న మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లను నడిపించడం ద్వారా ప్లాంట్‌ను తిరిగి లాభాల్లోకి తెచ్చేందుకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఆహార ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ అన్నారు. ఆయన మంగళవారం స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించారు. ఉక్కు డైరెక్టర్లు, సీనియర్ అధికారులతో పలు అంశాలపై చర్చలు జరిపారు. స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి, పురోగతి, ఇటీవల జరుగుతున్న మార్పులు, భవిష్యత్తు రోడ్డు మ్యాప్ వంటి అంశాలపై మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. ప్లాంట్ అభివృద్ధి కోసం ఉక్కు యాజమాన్యం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. సోలార్ పవర్‌ను వినియోగించుకొని, సాంకేతిక అడ్డంకులను తొలగించుకుని ఖర్చు ఆదా చేసుకోవాలని, దీని కోసం వ్యూహాలు రచించాలని సూచించారు. ప్లాంట్ విషయమై ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు. అనంతరం మోడల్ రూమ్, కీలక ఉత్పత్తి యూనిట్లను సందర్శించారు. స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించిన సొంత గనుల అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబుతోనూ, కేంద్ర ప్రభుత్వంతోనూ చర్చిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాన్ని అందిస్తామన్నారు.

భూసేకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలి

▸ వార్త 6లో..

పరిశ్రమల్లో మాక్ డ్రిల్, సేఫ్టీ ఆడిట్ తప్పనిసరి

▸ వార్త 2లో..

విశాఖ డెయిరీ పాలు, పెరుగు పారబోత!

▸ వార్త 3లో..

కార్పొరేట్ సంస్థల అక్రమాలు, దోపిడీపై

సినీ బాణం 'యూనివర్సిటీ పేపర్ లీక్'

పీపుల్‌స్టార్ ఆర్.నారాయణ మూర్తి

విద్యార్థులతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్.నారాయణమూర్తి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కార్పొరేట్ సంస్థల అక్రమాలను, దోపిడీని ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించేందుకు యూనివర్సిటీ పేపర్ లీక్ సినిమా తీశామని సినీ నిర్మాత, నటుడు, దర్శకుడు, పీపుల్ స్టార్ ఆర్.నారాయణ మూర్తి అన్నారు. ఆయన నిర్మించిన చిత్రం యూనివర్సిటీ పేపర్ లీక్ వచ్చే నెల 22న విడుదల కానున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఆంధ్రా యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ, ఇతర విద్యార్థి సంఘాలు 'మీట్ ది పీపుల్ స్టార్' కార్యక్రమం ఏర్పాటు చేశాయి. దీనికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యా వ్యవస్థలో లక్షలు ఖర్చుపెట్టి, కష్టపడి చదివి పోటీ పరీక్షలు రాస్తుంటే కొంత మంది కార్పొరేట్ సంస్థలవారు స్వార్థపూరిత వ్యాపార దురహంకారంతో వ్యవహరిస్తున్నారన్నారు. వాళ్ల సంస్థలో ఉన్న వారికే ర్యాంకులు రావాలని, వారి వద్ద ప్రిపేర్ అవుతున్న వారికే ఉద్యోగాలు రావాలని పేపర్ లీకులకు పాల్పడుతున్నారని తెలిపారు. దీని మూలంగా పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ మధ్య కాలంలో నీట్, ఎంసెట్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల పేపర్లు లీకై విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలను గుర్తుచేశారు. యూనివర్సిటీ విద్యార్థులందరూ తమ చిత్రాన్ని తిలకించి విద్యారంగంలో మిగతా 2లో..

త్వరలో చేనేత సహకార సంఘాల ఎన్నికలు

రాష్ట్ర మంత్రి సవిత

అధికారులు, నాయకులతో మంత్రి సవిత

ప్రజాశక్తి - అనకాపల్లి : రాష్ట్రంలో చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నామని రాష్ట్ర బిసి, ఇడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. అనకాపల్లి పట్టణంలో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆమెను బిసి వెల్ఫేర్, బిసి కార్పొరేషన్, చేనేత, జౌళి శాఖాధికారులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం మంత్రి సవిత శాఖల వారీగా అధికారులతో మాట్లాడారు. చేనేత సహకార సంఘాలను బలోపేతం చేస్తున్నామన్నారు. ఆప్కో, లేపాక్షి షోరూమ్‌ల ద్వారా అమ్మకాలు పెంచాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అర్హులైన నేతన్నలకు వర్క్‌షెడ్లు నిర్మించి ఇవ్వాలని, వర్క్ షెడ్లలో సోలార్ లైటింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని మంత్రి సవిత ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో బీసీ హాస్టల్ విద్యార్థుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని బిసి సంక్షేమ శాఖాధికారులను మంత్రి సవిత ఆదేశించారు. వేడి తాజా ఆహారం అందించాలన్నారు. ఖాదీ గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా యువతకు ఉపాధి కల్పనకు సబ్సిడీ రుణాలతో కూడిన యూనిట్లు నెలకొల్పాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్రీదేవి, ఖాదీ గ్రామీణాభివృద్ధి బోర్డు ఎడి పద్మ, లేపాక్షి మేనేజర్ కార్తీక్, ఆప్కో మేనేజర్ రమణమూర్తి, ఎంజెపి స్కూళ్ల కన్వీనర్ వెంకటేశ్వర్లు, బిసి కార్పొరేషన్ ఎమ్‌డి పెంటోజీరావు, చేనేత, జౌళి శాఖ జిల్లా అధికారి ఆర్‌వి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

కొణతాలను కలిసిన మంత్రి

స్థానిక రింగ్ రోడ్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణను రాష్ట్ర మంత్రి ఎస్.సవిత మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై కొద్దిసేపు చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మల్ల సురేంద్ర, డిసిఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

స్మార్ట్ మీటర్లను తిరస్కరించండి

సిద్ధపడిందన్నారు. ఈ మీటర్ల వల్ల నష్టం లేదని ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి ద్వారా మోసపూరిత ప్రకటనలను మీడియా ద్వారా చేయిస్తోందని తెలిపారు. సింగిల్ ఫేజ్ మీటరుకు రూ.8927, త్రీఫేజ్ మీటరుకు రూ.17,286 వసూలు చేయాలన్నది ప్రభుత్వ నిర్ణయంగా ఉందన్నారు. ఆ మొత్తం ఒకేసారి వసూలు చేస్తే ప్రజలు తిరగబడతారని ప్రతినెలా బిల్లుల్లో 93 నెలలు పాటు వసూలు చేయాలని నిర్ణయించారన్నారు. అదానీ మీటర్ల వల్ల ప్రజలపై రూ.25 వేల కోట్ల అదనపు భారం పడుతుందన్నారు. పీక్ టైం పేరుతో రాత్రులు, సెలవు దినాలు, వేసవి కాలాల్లో మరింత పెద్దఎత్తున ఛార్జీలు వేస్తారన్నారు. అదానీ స్మార్ట్ మీటర్లకు ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జ్ చేసుకోవాలన్నారు. అదానీ లాభాల కోసం ప్రజలెందుకు భారాలు భరించాలని కూటమి ప్రభుత్వాన్ని వేదిక నాయకులు ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి అని నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉండగా ప్రజలకు పిలుపునిచ్చి నేడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేస్తామని కూటమి నేతలు హామీనిచ్చి అధికారంలోకి వచ్చాక మాట తప్పారన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా నాయకులు కె.వనజాక్షి, ఎం.ఎ.బేగం, ఐద్వా జిల్లా నాయకులు ఆర్.విమల, బి.మమత, ఎపిఎఫ్‌టియుఎఫ్ జిల్లా కార్యదర్శి కె.దేవ సహాయం, పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు టి.శ్రీరామమూర్తి, వార్వా, నివాస్ జిల్లా అధ్యక్షులు ఎన్.ప్రకాష్‌రావు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు వై.రాంబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, కెవిపిఎస్ జిల్లా నాయకులు వై.రాజు, సిఐటియు జిల్లా నాయకులు కెఎం.కుమార మంగళం, ఎం.సుబ్బారావు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు కె.వెంకటరావు, బాలల సంఘం నాయకులు పి.సుశీల, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు డి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన జివిఎంసి ఒకటో వార్డు పరిధి కొత్తపేటలో పాదయాత్ర నిర్వహించారు. స్మార్ట్ విద్యుత్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, సిఐటియు నాయకులు నీలాతి రాము, పల్లా పెంటరాజు, జోగ వెంకటరావు, ఎం.ఈశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పలు ఇళ్ల గోడలకు స్టిక్కర్లు అతికించారు.

కార్పొరేట్ సంస్థల అక్రమాలు, దోపిడీపై సినీ బాణం 'యూనివర్సిటీ పేపర్ లీక్'

జరుగుతున్న అన్యాయాలకు, దోపిడీలకు అడ్డుకట్ట వేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, అధ్యక్షులు జి.అజయ్, ఎయు కార్యదర్శి డి.వెంకట రమణ, జిల్లా నాయకులు నరేష్, మౌనిక, భరత్, సోమేష్, ప్రగతి, నిఖిల్, ఎఐఎస్ఎఫ్ నాయకులు అభిషేక్, వైఎస్ఆర్ స్టూడెంట్ యూనియన్ నాయకులు బన్నూరెడ్డి పాల్గొన్నారు.

ఎఎంసికి లక్ష్మీనరసమ్మ పార్థివ దేహం అప్పగింత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎపిఎస్ ఆర్‌టిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేజెళ్ళ తులసీరాం తల్లి లక్ష్మీనరసమ్మ పార్థివ దేహాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజీ విద్యార్థుల పరిశోధన కోసం అనాటమీ డిపార్ట్‌మెంట్‌కు మంగళవారం అందజేశారు. లక్ష్మీనరసమ్మకు 103 సంవత్సరాలు. మంగళవారం పాత డెయిరీఫారం వద్దగల తులసీరాం ఇంటిలో ఆమె మరణించారు. లక్షీనరసమ్మ భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిపిఎం నాయకులు పి.మణి, వి.కృష్ణారావు, నరేంద్రకుమార్, పి.వెంకటరావు, డి.అప్పలరాజులతో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, పెన్షనర్లు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎం.జగ్గునాయుడు, కుమార్ మాట్లాడుతూ తులసీరాం ఆర్టీసీలో ఉద్యోగం చేసుకుంటూ ఎస్‌డబ్ల్యుఎఫ్ బలోపేతానికి కృషి చేసారన్నారు. రిటైర్ అయిన తరువాత కూడా ఆయన ఆర్టీసీ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలపై పనిచేస్తున్నారన్నారు. ఇంటిలోనే యూనియన్ మీటింగ్‌లు జరిగితే అందరినీ లక్ష్మీనరసమ్మ తమ పిల్లలతో సమానంగా చూసుకునేవారన్నారు. 'సొంతలాభం కొంతమానుకు పొరుగువానికి తోడుపడవోయ్ దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్' అన్న గురజాడ సూక్తిని లక్ష్మీనరసమ్మ అమలు చేసారని గుర్తుచేశారు. ఆమె మరణించిన తరువాత కూడా పదిమందికి ఉపయోగపడాలన్న ఆలోచనతో ఆమె బతికి ఉన్నప్పుడే తన కళ్ళు, దేహదానం చేయాలని తమ పిల్లలకు తెలియజేశారన్నారు. ఆమె కోరిక మేరకు జ్యోతిబసు దేహదాన ప్రోత్సాహక సంస్థ ద్వారా కళ్ళను, దేహాన్ని దానం చేసినందుకు తులసీరాం కుటుంబానికి, వారి అన్నదమ్ములకు, అక్కచెల్లెలకు, వారి బంధువులకు కృతజ్ఞతలను తెలియజేసారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

లక్ష్మీ నరసమ్మ దేహాన్ని అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

సిఎస్ఆర్ సాయంతో ఆసుపత్రులు, వసతిగృహాల అభివృద్ధి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్సార్) నిధుల సాయంతో జిల్లాలోని ఆసుపత్రులు, సంక్షేమ హాస్టళ్లవసతి గృహాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను ప్రతిపాదనలు రూపొందించి త్వరితగతిన సమర్పించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ప్రాథమిక అవసరాలను గుర్తించి నివేదించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ భవనంలో వివిధ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, విద్యా సంక్షేమ శాఖల అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు.

పరిశ్రమల్లో మాక్ డ్రిల్, సేఫ్టీ ఆడిట్ తప్పనిసరి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ప్రమాదాల నివారణకు రక్షణ చర్యలు చేపట్టాలని, తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించి కార్మికులను, ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులను, పరిశ్రమల నిర్వాహకులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో మంగళవారం సాయంత్రం వివిధ విభాగాల అధికారులు, పరిశ్రమల నిర్వాహకులతో కూడిన జిల్లా క్రైసిస్ మేనేజ్మెంట్ గ్రూప్ మీటింగ్ నిర్వహించారు. పరిశ్రమల్లో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రాణ నష్టం లేని విధంగా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, అన్ని చోట్లా ఆటోమెటిక్ అలారం మెకానిజం ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను, కంపెనీల యాజమాన్యాలను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమల్లో పని చేసే సిబ్బందికి ప్రమాదాల నుంచి తప్పించుకోవటం ఎలా అనే అంశంపై శిక్షణ ఇప్పించాలని చెప్పారు. ఆయా కంపెనీల్లో పని చేసే సిబ్బందికి, కార్మికులకు తప్పనిసరిగా బీమా పాలసీ చేయించాలని, పిపిఇ కిట్లు అందజేయాలని ఆదేశించారు. కార్మికులు, ప్రజల ప్రాణాల విషయంలో ఎవరూ ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించడానికి వీలు లేదని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీల చీఫ్ ఇన్‌స్పెక్టర్ సురేష్, విశాఖపట్టణం, భీమిలి ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్ మాథుర్, జిల్లా పరిశ్రమల శాఖ జిఎం ఆదిశేషు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆదర్శనీయుడు ఆనంద్ గజపతిరాజు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మాజీ మంత్రి పూసపాటి ఆనంద్ గజపతిరాజు జీవితంపై రాసిన పుస్తకాన్ని గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక్ గజపతిరాజు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు మంగళవారం రాత్రి గ్రాండ్ బే హోటల్‌లో ఆవిష్కరించారు. ఆనంద్ గజపతి రాజు 75వ జయంతిని పురస్కరించుకుని ఆయన కుమార్తె ఊర్మిళ గజపతి రాజు ఈ పుస్తకాన్ని రచించారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ ఎంతో పరిణితి చెందిన తన సోదరుడు ద్వారా అనేక విషయాలను నేర్చుకున్నానని తెలిపారు. క్రీడల పట్ల ఆసక్తిగల ఆనంద్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత క్రీడా స్థలాల విషయంలో తీసుకున్న నిర్ణయం ఎంతో మంది క్రీడాకారులకు మేలు చేసిందన్నారు. ఆయన అందరికీ ఆదర్శనీయుడన్నారు.

బంగారు కుటుంబాలకు మ్యాపింగ్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: స్వర్ణాంధ్ర జీరో పోవర్టి - పి4లో భాగంగా మార్గదర్శులకు బంగారు కుటుంబాల మ్యాపింగ్‌పై మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబాలను మ్యాపింగ్ చేయడానికి అవసరమైన మార్గదర్శులను ఎంపిక త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు ఎంపిక చేయబడిన 2,600 మార్గదర్శులు ఒక్కొక్కరికి 10 బంగారు కుటుంబాలు చొప్పున 26 వేల బంగారు కుటుంబాల మ్యాపింగ్ 2 రోజుల్లో పూర్తి కావాలని తెలిపారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతినెలా నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులో భాగంగా మంగళవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. బిపి,షుగర్, ఇసిజి, కంటి పరీక్షలతో పాటు క్యాన్సర్ పరీక్షలు కూడాఉచితంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు మెడికల్ విభాగం ప్రజా ఆరోగ్యవేదిక ప్రజాఆరోగ్యపరిరక్షణ కమిటీ మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో ఈ శిబిరాలు నిర్వహిస్తుండగా, విజ్ఞాన కేంద్రంలో ప్రతిరోజూ సాయంత్రం 5:30 గంటల నుంచి ఒక డాక్టర్ అందుబాటులో ఉండి ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారు.

మెడికల్ క్యాంపులో ప్రతి మూడు మాసాలకు ఒకసారి వైద్యపరీక్షలు అవసరమని వైద్యనిపుణులు తెలియజేస్తున్నారు.

ఎఐఎన్‌యులో కిడ్నీ మార్పిడి విజయవంతం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : క్యాన్సర్‌పై విజయం సాధించిన తండ్రి తన 37 ఏళ్ల కుమారుడికి తన కిడ్నీదానం ఇచ్చి రెండో జీవితం అందించిన సంఘటన డైమండ్ పార్క్ వద్ద ఎషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఎఐఎన్‌యు) ఆసుపత్రిలో చోటు చేసుకుంది. ఆసుపత్రి నెఫ్రాలజిస్టులు తండ్రి కిడ్నీ తీసి కుమారునికి అమర్చారు. 60 ఏళ్ల ఎడ్ల పైడయ్యకు రెండేళ్ల క్రితం ఉదర క్యాన్సర్ రావడంతో శస్త్రచికిత్స చేశారు. ఎంత క్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పటికీ, తన కుమారుడి ప్రాణాలు నిలబెట్టాలని ఆయన గట్టి సంకల్పం తీసుకున్నారు. సమగ్ర వైద్యపరీక్షలు చేసి, పెట్ సిటి స్కాన్ తీసి, ఆంకాలజిస్ట్ నుంచి అనుమతి తీసుకున్న తర్వాత ఆయన కిడ్నీ దానానికి అర్హులని వైద్యులు నిర్ధారించారు. కుమారుడు లక్ష్మణుడు కిడ్నీ వైఫల్యం కారణంగా అప్పటికే డయాలసిస్ చేయించుకున్నాడు. పరీక్షల కోసం వారిద్దరూ ఎఐఎన్‌యుకు వచ్చారు.

మంగళవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కన్సల్టెంట్ నెఫ్రాలజిస్టులు డాక్టర్ ఉదయ్‌దీపక్‌రావుగజారే మీడియాతో మాట్లాడుతూ, ఇది కేవలం వైద్యపరమైన విజయంకాదని, ప్రేమ,త్యాగాలకు నిజమైన నిదర్శనం అన్నారు. మామూలుగా కుమారుడికి తండ్రి కిడ్నీ ఇచ్చి కాపాడటమే అసాధారణం. అటువంటిది దానికి తోడు క్యాన్సర్ విజేత కావడం మరింత గొప్ప విషయం అన్నారు. ఈ మొత్తం చికిత్సలో తాము భాగమైనందుకు తాము ఎంతో గర్విస్తున్నామని చెప్పారు.

26న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా ప్రజాపరిషత్, విశాఖపట్నం స్థాయి సంఘ సమావేశాలు ఈనెల 26న జరుగుతాయని, జిల్లా ప్రజా పరిషత్ సిఇఒ నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుండి ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరం, వి.సి.సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

DOCUMENT MISSING

I, Kandrapu shyam would like to inform the general public that i have misplaced my original documents of my house which is bearing 4-14-13/A located at kandrapu vari street, pedda waltair, 530017. if any one finds it contact me at 8688236262.

Cont. 8688236262

IN THE HONOURABLE COURT OF FAMILY JUDGE CUM M.A.C.T VIZIANAGARAM M.V.O.P. 276/2024

Between :-
Koyyana Hari ....Petitioner
And :-
Bandaru Ramu and 2 others ......Respondents

NOTICE TO 2nd RESPONDENT

R2. M/S JAI JAGDISH TRANSPORT, Reptd. by VIVEK AGARWAL, FLAT NO : 40, MSR LAYOUT, MADHURAWADA, VISAKHAPATNAM - 48

Take notice that the above matter stands posted to 07.08.2025 for the appearance of 2nd respondent be fare this Honourable Court in person on through an adov advocate on **07-08-2025 at 10-30 AM.** If you fail to appear before this Honourable Court. The above matter will be decided in your absence and exparte.

Ch.D. Rammohana Rao
Advocate for petitioner
Sal Saibhavan, DNO: 2-18/1-55
Pradeep Nagar, Vizianagaram.
PH:9393328926

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE: NARSIPATNAM I.P.No.2/2024

Between:
Dondapati Ravindra Kumar ...Petitioner
And:
Kedarisetti Pradeep and 26 Others . . . Respondents

NOTICE

To
R-9: Kolluri Bharat Kumar, S/o Satyanarayana Aged 40 years, R/o Near Don Bosco School, Narsipatnam Town, Narsipatnam Mandal, Anakapalli District. PIN: 531116.
R-22: Lekkala Eswar Sai Ganesh Durga Prasad S/o Peda Appalanaidu Aged 32 Years R/o Nindukonda Village, Rolugunta Mandal, Anakapalli District. Pin: 531116.
R-24: Idam Satyanarayana S/o Apparao, Aged 48 Years, R/o Near Milk Booth, Yelamanchili Village, Yelamanchili Mandal, Anakapalli District.
R-25: Kommoju Satyavathi W/o veerababu Aged 45 Years, Hindu, R/O Vemulapudi Village, Narsipatnam Mandal, Anakapalli District.
R-26: Nagireddi Devi W/o Nagaraju, Aged 36 Years, R/o Opp.ROD Society, Tamaram Village, Makavarapalem Mandal, Anakapalli District.

Please take notice that the above named petitioner has instituted the above I.P. against the respondents for declaring the petitioner as insolvent and the matter stands posted to 24/7/2025 for your appearance. You are hereby directed to appear before the Hon'ble Court either in person or through duly instructed advocate on **24-7-2025 at 10.30 A.M.** in the above court, failing which the matter will be heard and determined in your absence.

(By order of the Hon'ble Court)

SRI J.S.N.G.A. RAJU
SRI S.V.VIJAY PRASAD
ADVOCATES
NARSIPATNAM.
Cell : 9866760788

Narsipatnam,
Dt: 06-7-2025.

ఫిర్యాదులపై పరిశీలన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో వచ్చిన ఫిర్యాదులపై ఆర్‌డిఒ సంగీత్ మాథుర్ మంగళవారం పరిశీలన చేశారు. ఆధార్ కార్డులో పొన్నకాయల రాముకు బదులు రాములమ్మ అని తప్పుగా నమోదు కావడంతో ప్రభుత్వం నుంచి రాయితీలు వర్తించడం లేదని కొవ్వాడ గ్రామానికి చెందిన పొన్నకాయల రాము ముఖ్యమంత్రి చంద్రబాబుకు దరఖాస్తు చేశారు. దీనిపై ఆర్‌డిఒ గ్రామానికి వచ్చి సమస్యపై ఆరా తీశారు. సమస్య తెలుసుకొని స్థానిక తహశీల్దార్ ఆనందరావుకు పరిష్కార బాధ్యతలను అప్పగించారు. అనంతరం బాందేవపురం గ్రామంలో ఒక భూ సమస్యపై ఆర్‌డిఒ పరిశీలించారు. పద్మనాభం కస్తూరిబా బాలికల పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల సౌకర్యాలు, విద్యా బోధన, మెనూ సక్రమంగా అమలు జరుగుతుందా లేదా అని విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో సహా భక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె.గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.

రాము కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కోరాడ గ్రామానికి చెందిన వైసిపి మండల అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు అన్నయ్య రాము మృతితో ఆ కుటుంబాన్ని పలువురు మంగళవారం పరామర్శించారు. కోరాడ గ్రామంలో సోమవారం నిర్వహించిన అంత్యక్రియల్లో మండలంలోని ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, ఎంపిపి కె.రాంబాబు, జడ్‌పి వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, భీమిలి మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాం, టిడిపి భీమిలి సమన్వయకర్త కోరాడ రాజబాబు, భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు, ఆనందపురం, భీమిలి, విశాఖపట్నం పోలీసులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు ఏరివేత

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీలో అన్నా క్యాంటిన్ వద్ద గల అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలలో పిచ్చి మొక్కలను మంగళవారం తొలగించారు. కేంద్రం ఆవరణలో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి పోవడంతో స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ దృష్టికి తీసుకు వెళ్లారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ జివిఎంసి ఉద్యాన విభాగం అధికారులకు తెలియజేశారు. స్పందించిన అధికారులు మంగళవారం మొక్కలను తొలగించారు.

చంద్రశేఖర్‌కు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్ భారత ప్రభుత్వంచే గుర్తించబడిన కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ ప్రతినిధుల ద్వారా ఎక్సలెన్స్ ఇన్ లీడర్ షిప్ అండ్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు కళాశాల వర్గాలు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశాయి. విలువలతో కూడిన విద్యాభివృద్ధితో పాటు, విద్యార్థుల బోధనా సామర్థ్యాల పెంపుదలకు ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించినట్లు తెలిపారు. డాక్టర్ చంద్రశేఖర్‌ను అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

సర్టిఫికెట్ల పరిశీలన గడువు పొడిగింపు

ప్రజాశక్తి -భీమునిపట్నం : డిఇఇ సెట్ -2025 సర్టిఫికెట్ల పరిశీలన గడువును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు స్థానిక డైట్ ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఈ నెల 17 న ప్రారంభమై 22తో ముగిసిన విషయం విదితమే.

విశాఖ డెయిరీ పాలు, పెరుగు పారబోత!

- కొత్త కార్మికులకు అవగాహన లేమి
- పాడవుతున్నాయని డీలర్ల ఆందోళన!
- పాత కార్మికుల తొలగింపే కారణమా?

పారబోస్తున్న పాడైన పాలు, పెరుగు

ప్రజాశక్తి -గాజువాక : గత రెండు రోజులుగా విశాఖ డెయిరీ తయారుచేస్తున్న పాలు, పెరుగు పూర్తిగా పాడైపోతున్నాయి. గాజువాకలో పది మంది డీలర్ల వద్ద వేలాది లీటర్ల పాలు, పెరుగు పాడైపోవడంతో, వారందరూ డెయిరీ యాజమాన్యం వద్దకు వచ్చి గొడవకు దిగారు. బయటకు తెలిస్తే చెడ్డ పేరు వస్తుందని, వారందరినీ శాంతపరిచి పాడైపోయిన పాలు, పెరుగును లోపలికి తరలించారు. వెనుక నుంచి కాలువల ద్వారా బయటికి పంపుతున్నారు. వేలాది లీటర్ల పెరుగు, పాలు వృథా అయ్యాయి.

కార్మికుల తొలగింపే కారణమా?

వేల లీటర్ల పాలు, పెరుగు పాడవడానికి ప్రధాన కారణం గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను డెయిరీ యాజమాన్యం తొలగించడమేనని విమర్శలు వినిపిస్తున్నాయి. పాత కార్మికులను తొలగించి వారి స్థానంలో కొత్తగా కార్మికులను తీసుకొచ్చారు. వారికి ఎలాంటి అనుభవమూ లేకపోవడంతో తరచూ పాలు, పెరుగు పాడైపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

హౌసింగ్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని తంగుడబిల్లి గ్రామంలో 690 ఎకరాల్లో నిర్మాణంలో ఉన్న మెగా హౌసింగ్ ప్రాజెక్టులో మౌలిక సదుపాయాలు యుద్ధప్రాతిపదికన అందిస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం తంగుడబిల్లిలో హౌసింగ్ కాలనీని ఆయన పరిశీలించి, ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 16,996 ఇళ్లలో 2,036 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఇళ్ల నిర్మాణ నాణ్యతపై ప్రజల్లో అనేక అభిప్రాయాలు వస్తున్నాయని, వీటిని సీరియస్‌గా తీసుకొని తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి వీఎంఆర్‌డిఎ, జివిఎంసి, ఇపిడిసిఎల్ శాఖల సమన్వయంతో తక్షణమే విద్యుత్, రోడ్లు, డ్రైన్లు, మంచినీటి వంటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణానికి బాధ్యత వహిస్తున్న కాంట్రాక్టర్ పరిశీలన సమయంలో గైర్హాజరు కావడాన్ని తప్పుపట్టారు. నాణ్యత విషయంలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులను అప్రమత్తం చేశారు. పనులపై నిరంతర పర్యవేక్షణ జరగాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సత్తిబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సూరిబాబు, తహశీల్దార్ ఎస్.సూరిబాబు, టిడిపి నాయకులు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, తాట్రాజు అప్పారావు, బిఆర్‌బి.నాయుడు, గంగ్రెడ్డి స్వామినాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతుని కుటుంబానికి పోలీసుల సాయం

ప్రజాశక్తి-మధురవాడ : రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి పిఎం.పాలెం పోలీసులు ఆర్థిక సహాయం అందించారు. నార్త్ జోన్ ఎసిపి అప్పలరాజు కథనం ప్రకారం... నగరంలోని సిబిఎం కాంపౌండ్ అమర్ నగర్ ప్రాంతానికి చెందిన పొట్నూరు శంకరరావు కుటుంబం ఇటీవల మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీకి వచ్చి నివాసం ఉంటుంది. శంకరరావు పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 17 వ తేదీన పనులకు వెళ్లిన శంకరరావు (41)ను మారికవలస జాతీయ రహదారిపై లారీ ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు శంకరరావుకు భార్య జ్ఞానేశ్వరితో పాటు ఒక పాప విద్యన(9), బాబు ప్రేమ నారాయణ తేజ్ (7) ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయి నిరాశ్రయులయ్యారని గమనించిన ఎస్ఐ భాస్కర్ మానవతా దృక్పథంతో స్పందించి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్నానని, మరింతమంది ఆర్థికంగా అండగా నిలిస్తే బాగుంటుందని వాట్సాప్ స్టేటస్ ద్వారా సందేశాన్ని ప్రచారం చేశారు. దానికి స్పందన లభించి రూ.1.58 లక్షలు వచ్చాయి. ఈ మొత్తాన్ని సోమవారం పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ ఆవరణలో నార్త్ సబ్ డివిజన్ ఎసిపి ఎస్.అప్పలరాజు ఆధ్వర్యాన సిఐ బాలకృష్ణ సమక్షంలో మృతుని కుటుంబానికి అందజేశారు.

బాకూరుపాలెంలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ'

ప్రజాశక్తి - ఆనందపురం: మండలంలోని బాకూరుపాలెం గ్రామంలో మంగళవారం 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ దవళ నాగేశ్వరరావు ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వైసిపి భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఈ వాస్తవాన్ని గ్రామస్తులకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల వారీగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గనిరెడ్డి శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, వాసురావు, జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, ఎంపిపి మజ్జి శారదాప్రియాంక, మజ్జి వెంకట్రావు, వైస్ ఎంపిపి పాండ్రంగి శ్రీను, బొట్ట రామకృష్ణ, బోని అప్పలనాయుడు, చందక సూరిబాబు, చందక లక్ష్మి, బంక శ్రీను, విజనిగిరి అప్పలనాయుడు పాల్గొన్నారు.

వైసిపి మండల మహిళా అధ్యక్షులుగా చందక లక్ష్మి

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండల వైసిపి మహిళా అధ్యక్షులుగా చందక లక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం బాకురుపాలెం గ్రామంలో ఏర్పాటుచేసిన వైసిపి విస్తృతస్థాయి సమావేశంలో భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేయాలన్నారు. చందక లక్ష్మి మాట్లాడుతూ, వైసిపి మరలా అధికారంలోకి రావడానికి ఐక్యంగా పనిచేయాలన్నారు. గతంలో రెండు సార్లు ఈ పదవిలో పనిచేసిన అనుభవం తనకు ఉందని తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని, మహిళల హక్కులు, సమస్యల పరిష్కారంపై మరింత లోతుగా పని చేస్తానని చెప్పారు. ఈ

చందక లక్ష్మిని అభినందిస్తున్న మజ్జి శ్రీను తదితరులు

కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగ్రెడ్డి శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, బోని అప్పలనాయుడు, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు చందక సూరిబాబు, మండల మాజీ ఉపాధ్యక్షులు పాండ్రంకి శ్రీను, బొట్ట రామకృష్ణ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధి అక్కిరెడ్డిపాలెం గ్రామం హైవే పక్కన నూతిలో సుమారు 30 ఏళ్ల పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు సిఐ సతీష్‌కుమార్ తెలిపారు. మృతదేహం పరిస్థితిని పరిశీలించగా సుమారు 72 గంటల క్రితం మరణించి ఉండవచ్చని పేర్కొన్నారు. మృతుని శరీరంపై లేత ఆకాశం రంగు బనియన్, నలుపు-నీలం రంగుల షార్ట్ ఉన్నట్లు తెలిపారు. మృతుని దుస్తుల ఆధారంగా గుర్తించగలిగేవారు వెంటనే పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను లేదా స్టేషన్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం గ్రామానికి చెందిన తుమ్మగంటి రామారావు (45) కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం సాయంత్రం పురుగుల మందు (గడ్డి మందు) తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర అస్వస్థతకు గురైన రామారావును కుటుంబ సభ్యులు తొలుత గాయత్రి హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి కెజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం ఆయన మృతిచెందాడు. రామారావుకు భార్య నారాయణమ్మ, ఇద్దరు కుమార్తెలు శిరీష (15), లక్ష్మీ (13) ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఆ కారణంగా మనస్తాపానికి గురై రామారావు ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

జీడి మామిడి సమగ్ర సస్యరక్షణపై శిక్షణ

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలంలోని గండిగుండం గ్రామంలో జీడి మామిడి తోటల యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల జీడి మామిడి పరిశోధన కేంద్రానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, జూన్, జులై, ఆగస్టు నెల్లో జీడి మామిడి తోటలలో చేపట్టాల్సిన ముఖ్యమైన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా కొమ్మల కత్తిరింపు, సరైన ఎరువుల వాడకం, నీటి నిర్వహణ, సమగ్ర సస్యరక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు. పూత, పిందె దశలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తెగుళ్ళు, పురుగుల నివారణపై వివరించారు.

జిల్లా ఉద్యాన అభివృద్ధి అధికారి శ్యామల మాట్లాడుతూ, ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల గురించి రైతులకు వివరించారు. మండల ఉద్యాన అధికారి సోనీ మాట్లాడుతూ, కూరగాయల సాగు, ఉపాధి పథకాల ప్రయోజనాలు, ప్రోత్సాహక కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గనిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఉడా డైరెక్టర్ గనిరెడ్డి సోంబాబు, టిడిపి జిల్లా కార్యదర్శి గనిరెడ్డి రమేష్, ఆనందపురం వ్యవసాయాధికారి సంధ్యా రత్నప్రభ, గ్రామ ఉద్యాన సహాయకులు దుర్గాదేవి, రైతులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవికి వినతి పత్రం అందజేస్తున్న అశోక్ చక్రవర్తి

షెడ్యూల్ తెగల కోసం ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించాలి

ప్రజాశక్తి -తగరపువలస : షెడ్యూల్ ప్రాంతాల్లో షెడ్యూల్ తెగల కోసం ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించాలని కోరుతూ ఎపి గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.భార్గవికి జివిఎంసి రెండో వార్డుకు చెందిన సుందరమ్మ రామన్న చెట్టి వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ చెట్టి అశోక్ చక్రవర్తి మంగళవారం వినతి పత్రం అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరులోని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలో గిరిజన చట్టాలపై నిర్వహించిన వర్క్ షాప్‌నకు హాజరైన గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేసినట్లు అశోక్ చక్రవర్తి తెలిపారు. జిఒ3 ను పునరుద్ధరించాలని, కమ్యూనిటీ ప్రభావ ఆధారాలు, చట్ట పరమైన దృఢత్వంతో షెడ్యూల్ తెగల వారికి వంద శాతం రిజర్వేషన్ పునరుద్ధరించేలా కొత్త జిఒ జారీ చేయాలని కోరారు.

ములగాడ - మారుతి జంక్షన్ రోడ్డును నిర్మించాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 58వ వార్డు పరిధి ములగాడ నుంచి మారుతి జంక్షన్ వరకు నూతన రోడ్డు వేసి రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలు వెయ్యాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్‌చేశారు. ఈ మేరకు సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం ములగాడ నుంచి గోడౌన్ రోడ్డు వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రకు ముఖ్య అతిథి జగ్గునాయుడు హాజరై మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే గణబాబు జోక్యం చేసుకొని ములగాడ నుండి మారుతి జంక్షన్ వరకు నూతన రోడ్డు వేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని, రోడ్డుకిరువైపులా విద్యుత్ దీపాలు వెలిగించాలని కోరారు. ఈ రహదారిలో వేలాదిగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, వ్యాన్లు, కార్లు ప్రయాణిస్తున్నాయని, ములగాడ నుండి మారుతి జంక్షన్ వరకు సరైన రోడ్డు మార్గం లేక ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఈ రహదారిలో దుమ్ము ధూళి, ప్రైవేటు గోడౌన్ల రసాయన కాలుష్యంతో ములగాడ ప్రజలు, ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు రోగాల పాలవుతున్నారని తెలిపారు. గోడౌన్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకొని నూతన రోడ్డు నిర్మించాలని కోరారు. లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమస్యను కలెక్టర్, జివిఎంసి కమిషనర్, ఎమ్మెల్యే గణబాబు దృష్టికి లిఖితపూర్వకంగా తీసుకెళ్తామని తెలిపారు. ఈ పాదయాత్రలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయకులు కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తి, సత్యారావు, బూడి శ్రీను, పి.వి.భాస్కరరావు, గంటా సత్యనారాయణ, జె.రామునాయుడు, జి.నరేష్, ఎస్.వాసు, సమీర్, రామకృష్ణ, గణేష్, నీలయ్యరాజు, సుభాన్, ప్రశాంత్, మహేంద్ర, కోటి, ప్రేమ్, గోడౌన్ల కార్మికులు పాల్గొన్నారు.

పాదయాత్రనుద్దేశించి మాట్లాడుతున్న ఎం.జగ్గునాయుడు

సమావేశమైన ఐద్వా శీలానగర్ కమిటీ నాయకులు

సూపర్ సిక్స్ అమలు చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : కూటమి ప్రభుత్వ పాలకులు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలను అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి డిమాండ్‌చేశారు. శీలానగర్ ఐద్వా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడేళ్లలో చేసిన కార్యక్రమాలు, ఫలితాలు, భవిష్యత్తు కర్తవ్యాలపై చర్చించారు. అధిక ధరలు, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పినా అందరికీ అమలు కావడంలేదన్నారు. ఆస్తి పన్ను, విద్యుత్ భారాలు వేశారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని, వీటి నష్టాలను కాలనీలో ప్రచారం చేయాలని చెప్పారు. అధిక ధరలు కారణంగా ప్రజల్లో కొనుగోలు శక్తి పడిపోయిందని, సరైన ఆహారం లేక మహిళలు రక్తహీనత తదితర అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. జీవని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, అడ్వకేట్ మల్లికా, భవాని, గీత, పుష్ప, వందన, విన్నీ, బి.మణి, బేబీ, మానస పాల్గొన్నారు.

వైభవంగా దాశరథి కృష్ణమాచార్య జయంతి

ప్రజాశక్తి-సీతమ్మధార : అభ్యుదయ రచయితల సంఘం విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యాన 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అని నినదించిన తెలంగాణ ఉద్యమ కవి దాశరథి కృష్ణమాచార్య 100వ జయంతిని విశాఖ పౌర గ్రంథాలయంలో వైభవంగా నిర్వహించారు. అరసం జిల్లా శాఖ అధ్యక్షులు ఉప్పల అప్పలరాజు సభాధ్యక్షత వహిస్తూ, గత సంవత్సరం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిపిన దాశరథి ఉత్సవాలను గుర్తు చేశారు. తెలంగాణా కవి అయినా తెలుగు తల్లి అని దాశరథి ప్రస్తావించారని వివరించారు. అరసం కవి బసు పోతన స్వాగతోపన్యాసము చేశారు. ప్రముఖ సాహితీ విశ్లేషకులు డాక్టర్ డి.వి.సూర్యారావు దాశరథి ఉద్యమ సాహిత్యం గురించి మాట్లాడుతూ "ఆ చల్లని సముద్ర గర్భం" అంటూ మొదలు పెట్టారు. అతని రచనలన్నిటినీ స్పృశిస్తూ ప్రసంగించారు. కవికి ప్రాంతీయ భేదం లేదన్నారు. భారతీభూషణ ప్రఖ్యాత వ్యాఖ్యాత రాంభట్ల నృసింహశర్మ దాశరథి చలనచిత్ర గీతాలు గూర్చి ఉటంకిస్తూ 'ఆ రజనీకర బింబం' పాటతో ప్రారంభించారు. గరళము నుండి సరళమును సాహిత్యాన్ని దించిన కవి దాశరథి అని అభివర్ణించారు. అరసం ఉపాధ్యక్షులు ఎస్.హనుమంతరావు మాట్లాడుతూ, దాశరథి కవిత్వంలో మానవతా కేతనం ఎగురుతుందని చెప్పారు.

రక్తదానం చేస్తున్న ఎన్ఎడి సిఐ కార్మికులతో ఎమ్మెల్యే గణబాబు

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-గోపాలపట్నం : రక్తదానం ప్రాణదానంతో సమానమని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పెతకంశెట్టి గణబాబు అన్నారు. ఎన్ఎడి సివిలియన్ యూనియన్ ఆధ్వర్యాన హమ్మిభవన్‌లో తొమ్మిదేళ్ల క్రితం ఎఎన్32 విమాన ప్రమాదంలో మరణించిన ఎన్ఎడి కార్మికుల జ్ఞాపకార్థం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మరణించిన 9 మందికి నివాళులర్పించారు. రక్తదానం చేస్తున్న సిఐ యూనియన్ కార్మికులకు, నాయకులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రక్తాన్ని తయారుచేయలేమని, కేవలం మనిషి మాత్రమే సాటి మనిషికి రక్తదానం చేసి ప్రాణం కాపాడగలరని పేర్కొన్నారు. డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ, ఏడాదిలో మూడుసార్లు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సిఐ యూనియన్ గౌరవాధ్యక్షులు థామస్ మాట్లాడుతూ, ఈ రక్తదాన శిబిరం జరగకుండా యాజమాన్యం అనేక ఇక్కట్లు పెట్టిందని, అయినా కార్మికులు తన వంతు బాధ్యతను నెరవేర్చారని తెలిపారు. 60 మంది కార్మికుల నుంచి ఎ.ఎస్.రాజా రక్తనిధి సిబ్బంది రక్తాన్ని సేకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, సిఐ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నూకరాజు, ఆర్.శ్రీనివాసరావు కార్మికులు పాల్గొన్నారు.

మహిళలపై హింస అరికట్టాలి : ఐద్వా

ఐద్వా మల్కాపురం జోన్ నూతన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి -ములగాడ : మహిళలపై హింసను అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నాయకులు కోరారు. ఐద్వా మల్కాపురం జోన్ పదో మహాసభలు మంగళవారం వెంకన్నపాలెంలోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఐద్వా సీనియర్ నాయకులు వైదాడ ధర్మారం వారసులు కారాడ పాలమ్మ పతాకావిష్కరణ చేశారు. మహాసభకు అధ్యక్ష వర్గంగా బి.మమత, వై.కళ్యాణి వ్యవహరించారు. ముందుగా మల్కాపురంలో ఐద్వా ఏర్పాటుకు కృషిచేసిన వైదాడ ధర్మారం చిత్రపటానికి సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి పూల మాలవేసి నివాళులర్పించారు. గత మూడేళ్ల కాలంలో మరణించిన కార్యకర్తలకు, నాయకులకు మహాసభలో ఐద్వా జోన్ కమిటీ సభ్యులు కె.అన్నపూర్ణ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రతినిధులు నివాళులర్పించారు. ఐద్వా మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.విమల గత మూడేళ్ల ఉద్యమాలు, కార్యదర్శి నివేదికను ప్రవేశ పెట్టారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

మహాసభలో ఐద్వా జిల్లా అధ్యక్షకార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి మాట్లాడుతూ, మహిళలపై దాడులను వ్యతిరేకంగా, యువతులకు రక్షణ కల్పించడంలో ముందుండి పోరాడుతున్న సంఘం ఐద్వా అన్నారు. ఉన్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలుచేయకపోవడంతో పిల్లల నుండి ముసలివారి వరకు అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఐద్వా మల్కాపురం జోన్ అధ్యక్ష, కార్యదర్శులుగా బి.మమత, ఆర్.విమల మళ్లీ ఎన్నికయ్యారు. కోశాధికారిగా వై.కళ్యాణి, ఉపాధ్యక్షులుగా ఎం.జయలక్ష్మి, పి.వరలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా పి.పుణ్యవతి, బి.రాజేశ్వరి, ఇ.అరుణ, ఎం.నిర్మల, కమిటీ సభ్యులుగా పి.అరుణ, యు.హేమలత, ఆదిలక్ష్మి, జ్యోతి, శ్రీదేవి ఎన్నికయ్యారు.

సెక్యులర్, సోషలిజం పదాల తొలగింపునకు బిజెపి యత్నం

ప్రజాశక్తి-సీతమ్మధార : రాజ్యాంగ సవరణ ద్వారా సెక్యులర్, సోషలిజం పదాలను తొలగించాలని ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చాలని పన్నాగం పన్నుతుందని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జెవి.ప్రభాకర్ ఆరోపించారు. అంబేద్కర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇది ఒక్క దళితుల సమస్య కాదని, దేశంలో ప్రజలందరి సమస్యగా గుర్తించాలని కోరారు. ఆ పదాలను తొలగించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. జాతీయ జెండాను, రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్ గౌరవించదని చెప్పారు. ఈనెల 26న అంబేద్కర్ భవనంలో జరగనున్న డిహెచ్‌పిఎస్ విశాఖ జిల్లా ఐదవ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో రాజులు, రాంబాబు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పలు చోట్ల 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును ప్రజలకు తెలియ జేస్తూ జివిఎంసి మూడో వార్డు ఎగువపేటలో 'సుపరి పాలనలో తొలి అడుగు' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు హరీష్, రాజు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి వెంకటాపురం, నందమూరినగర్‌లో స్థానిక ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు ఆధ్వర్యాన 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలనడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంపర ఆనంద్, నందవరపు సోములు, మూర్తి పట్నాయక్, జీన్‌వేర్ రమేష్, గవ్వా భాస్కర్, కెవి.బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు

ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డులో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని వార్డు టిడిపి అధ్యక్షులు పొత్రకండ ధర్మారావు ఆధ్వర్యాన నిర్వహించారు. ఆరిలోవ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కరపత్రాలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో యల్లమిల్లి సురేష్, తురకపూడి బాలరాజు, మజ్జి రమణి, సోనాపురం సుధాకర్, ఒడిశెట్టి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ముచ్చెర్ల గ్రామ పంచాయతీ తంగుడబిల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

వృద్ధుల అనుభవాలు మానవ వనరులు

ప్రజాశక్తి -ములగాడ : వృద్ధులే దేశ సంపద అని, వారి అనుభవాలే మానవ వనరులని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ ప్రేమకుమారి పేర్కొన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో మంగళవారం 'గ్రాండ్ పేరెంట్స్ డే' నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ, తాతయ్యలు, నాన్నమ్మలు, అమ్మమ్మలు తమ మనవళ్లకు, మనవరాళ్లకు విలువలను, సభ్యతను, సంస్కారాన్ని తెలియచేయాలని సూచించారు. భారతదేశ సంస్కృతికి మూల బిందువు కుటుంబ ఆత్మీయ బంధాలేనని పేర్కొన్నారు. 'సమాజంలో గ్రాండ్ పేరెంట్స్ పాత్ర'పై కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ హిందీ అధ్యాపకులు ఎ.ఆదిలక్ష్మి తదితరులు ప్రసంగించారు. గ్రాండ్ పేరెంట్స్ తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం 1971లో ఇండియా- పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో పాల్గొన్న సైనికుడు లక్ష్మణరావును సత్కరించారు. సమావేశానికి వచ్చిన గ్రాండ్ పేరెంట్స్ అందరికీ బహుమతులను పంచారు. సెయింట్ ఆన్స్ ఫీస్ట్ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆటపాటలతో విద్యార్థినులు సందడి చేశారు.

స్విమ్మింగ్ విజేతకు అభినందనలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఇటీవల నిర్వహించిన సబ్ జూనియర్, జూనియర్ అంతర జిల్లాల స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మూడు స్వర్ణ, రెండు రజత పతకాలు సాధించిన బుల్లయ్య జూనియర్ కళాశాల బైపిసి ప్రథమ సంవత్సరం విద్యార్థిని బిపికెఎల్.ప్రీతిని కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ అభినందించారు. ఈ పోటీలలో ప్రీతి 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 200 మీటర్ల బటర్‌ఫ్లై, ఫ్రీ స్టైల్ విభాగాలలో పతకాలు సాధించింది. ఈ అభినందన కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సోమేశ్వరరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్ఎస్.లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

శ్రవణానందంగా ఆపాత మధురాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : పౌర గ్రంథాలయంలో సీనియర్ గాయనీగాయకులు ఆ పాత మధురాలను శ్రవణానందముగా ఆలపించారు. గాయకులు పెమ్మరాజు రామ్ సమర్పణలో నూతల ప్రభాకర్ పర్యవేక్షణలో ఎవిఆర్ ఈవెంట్స్ మంగళవారం నిర్వహించారు. సీనియర్ గాయనీమణులు గంటి ఉష, సివి రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, అంబికల గళ సహకారంతో గాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, రామనరసింహం, నాగేశ్వరరావు తదితరులు ఆపాత మధురాలను వినిపించారు.

విఎస్.అచ్యుతానందన్‌కు ఘన నివాళి

అనకాపల్లిలో అచ్యుతానందన్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -యంత్రాంగం

అనకాపల్లి : సిపిఎం ఆవిర్భావ నాయకులు, కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ విఎస్.అచ్యుతానందన్ మృతికి ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించాయి. సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు అధ్యక్షత మంగళవారం జరిగిన సంతాప సభలో అచ్యుతానందన్ చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంటా శ్రీరామ్, సీనియర్ నాయకులు కె.తేలయ్యబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంటా శ్రీరామ్ మాట్లాడుతూ నూట రెండేళ్ల నిండు జీవితం గడిపిన విఎస్ ఎనిమిదిన్నర దశాబ్దాలకు పైగా ప్రజాఉద్యమానికి అంకితమయ్యారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.ఉమామహేశ్వరరావు, నాయకులు కె.ఈశ్వరరావు, పి.చలపతి, నాగిరెడ్డి సత్యనారాయణ, బి.నూకఅప్పారావు పాల్గొన్నారు.

మునగపాక : కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ వి.ఎస్.అచ్యుతానందన్ మృతి పట్ల స్థానిక సిపిఎం నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్థానిక స్టేట్ బ్యాంకు వద్ద సిపిఎం సీనియర్ నాయకులు ఆళ్ల మహేశ్వరరావు అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఇందులో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన ఆయన చదువుకు స్వస్తి పలికి, తన అన్న నడుపుతున్న టైలర్ షాపులోనే సహాయకునిగా చేరాడని తెలిపారు. తరువాత కాలంలో కొబ్బరి పీచు కార్మికుడిగా పని చేస్తూ 17 ఏళ్ల వయసులో కమ్యూనిస్టు పార్టీలో చేరినట్లు చెప్పారు. తుది శ్వాస వరకు ప్రజా ఉద్యమానికి అంకితమయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్ బ్రహ్మాజీ, టెక్కలి జగ్గారావు, ఎంవిఎస్ నారాయణ, సిపిఐ నాయకులు పెంటకోట సత్యనారాయణ, భీశెట్టి పరదేశి నాయుడు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ సినిమా హాల్ జంక్షన్లో సిఐటియు ఆధ్వర్యంలో అచ్యుతానందన్ చిత్రపటానికి సిఐటియు నాయకులు కన్నూరు నాయుడు పూలమాల వేసి నివాళుళ్లర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఆయన స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.అప్పారావు, జి.శ్రీను, నాయుడు, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పరవాడ సినిమా హాల్ జంక్షన్‌లో...

గాజువాక : కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతి పట్ల భెల్ సిపిఎం నాయకులు జిటిపి ప్రకాష్, నారపరెడ్డి, ఎస్.జగన్నాథరావు సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. సంతాపం తెలిపిన వారిలో కె.విజయ్‌కుమార్, ఎస్.అప్పారావు, పి.కనకారావు, పి.శివరాం, జి అచ్చున్ననాయుడు ఉన్నారు.

తగరపువలస : విఎస్ అత్యుతానందన్ మృతికి సిపిఎం, సిఐటియు భీమిలి జోన్ కమిటీ నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎన్.మూర్తి, ఎస్.అప్పలనాయుడు, పల్లా పెంటరాజు, నమ్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలసలో...

జిల్లా అకడమిక్ ఫోరం చైర్మన్‌గా డిఇఒ

డిఇఒ అప్పారావు నాయుడు

ప్రజాశక్తి-అనకాపల్లి : కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు 41 మంది సభ్యులతో జిల్లా ఎకడమిక్ ఫోరం ఏర్పాటు చేయగా అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడును చైర్మన్ గాను, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆర్ జయ ప్రకాష్ వైస్ చైర్మన్‌గా నియమించారు. మెంబర్ కన్వీనర్లుగా భీమునిపట్నం డైట్ ప్రిన్సిపాల్ ఎల్ సుధాకర్, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ ఏ శ్రీధర్ రెడ్డి, జిల్లా ఉమ్మడి పరీక్ష నిర్వహణ కార్యదర్శి సి.సత్యనారాయణ నియమితులయ్యారు. వీరితోపాటు ఒక్కొక్క సబ్జెక్టుకు నలుగురు చొప్పున నిష్ణాతులైన వారిని నియమించారు. మండలాల్లో మండల అకాడమిక్ ఫోరం ఏర్పాటు చేసినట్టు డిఇఒ అప్పారావునాయుడు తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల డైరీ, పాఠ్య ప్రణాళిక, సంస్థాగత ప్రణాళికలు, ఉపాధ్యాయుల పాఠ్య బోధన వంటి అంశాలపై ప్రభుత్వానికి నివేదిస్తారని డీఈవో అప్పారావు నాయుడు తెలిపారు.

పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న డిపిఒ సందీప్

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ : డిపిఒ

ప్రజాశక్తి-చోడవరం : గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పంచాయతీ అధికారి పి.సందీప్ అన్నారు. మంగళవారం ఐవీఆర్ఎస్ ఫిర్యాదు మేరకు ముదుర్తి గ్రామంలో ఆయన పర్యటించారు. అస్తవ్యస్తంగా ఉన్న పారిశుధ్యాన్ని చూసి పంచాయతీ కార్యదర్శి గోవిందమ్మపై అసహనం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, దీంతో ప్రజలు జ్వరం, అంటురోగాల బారినపడుతురన్నారని తెలిపారు. ఎప్పటికప్పుడు డ్రైనేజీలు శుభ్రపరచడం, చెత్త లేకుండా చూడడం క్లోరినేషన్, దోమల మందు పిచికారీ వంటివి నిరంతరం చేపట్టాలని ఆదేశించారు. అనంతరం వెంకన్నపాలెం పంచాయతీలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, కార్యదర్శి గంగాధర్ పాల్గొన్నారు.

పశు వైద్య కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని నరసింగబిల్లి పశు వైద్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ ఎం.చంద్ర శేఖర్ సందర్శించి తనిఖీ నిర్వహించారు. అన్ని రికార్డులు, స్టాక్ పుస్తకాలు, వైద్య సేవల నమోదు వివరాలు వంటి పత్రాలను సమీక్షించారు. ప్రస్తుతం అమలులో ఉన్న థైలేరియా వ్యాక్సినేషన్ కార్యక్రమం, మేకలు గొర్రెలకు డీవార్మింగ్ కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులకు సార్టెడ్ వీర్యం వాడకం, ప్రయోజనాలు లభ్యతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య అధికారి డాక్టర్ ఆల్ఫోన్సా జార్జ్ పాల్గొన్నారు.

ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ గ్రామంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చల్లా నానాజీ ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు మంగళవారం జరిగాయి. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణురాలు గుంటూరు ఇందిర క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు జరిపారు. ప్రతి గ్రామంలో ఇటువంటి క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చల్లా నానాజీ, కొయ్యన శనిబాబు, చెల్లిబోయిన కృష్ణ, ఆబోతు సన్నిబాబు, చల్ల చిన్న ఎరుకునాయుడు పాల్గొన్నారు

కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు

డిసిసిబి చైర్మన్‌ను కలిసిన పిఎసిఎస్‌ల అధ్యక్షులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని నాలుగు పిఎసిఎస్ నూతన అధ్యక్షులు మంగళవారం జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ కార్యాలయంలో డిసిసిబి చైర్మన్ కోన తాతారావును మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సహకార సంస్థల అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో దేవరాపల్లి, కలిగొట్ల, ఎం.అలమండ పిఎసిఎస్‌ల అధ్యక్షులు పూడి సత్యారావు, దొగ్గ దేముడునాయుడు, గొర్లె గోవింద తదితరులు పాల్గొన్నారు.

దొంగలను పట్టుకోవడానికి సహకరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : దొంగలను పట్టుకోవడంతో, దొంగతనాలను అరికట్టడానికి సహకరించాలని అనకాపల్లి టౌన్ సిఐ విజయకుమార్ అన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం బంగారుషాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. పలు ఇళ్లల్లో దొంగతనాలు చేస్తున్న దొంగలు బంగారు ఆభరణాలు అమ్మకానికి వచ్చినప్పుడు వారిని గుర్తించాలని సూచించారు. ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందించాలని కోరారు. షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటేశ్వరరావు, ఈశ్వరరావు, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జాన్స్‌లో కెప్టెన్స్ నియామకం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట సెయింట్ జాన్స్ పాఠశాలలో స్కూల్ హెడ్ గర్ల్, హెడ్ బాయ్, గ్రూప్ కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్ నియామకం జరిగింది. వీరు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న 13వ ఆంధ్ర ఎన్‌సిసి కమాండెంట్ ఆఫీసర్ కల్నల్ నిరంజన్ కుమార్ విద్యార్థుల నుండి గౌరవం వందనం స్వీకరించారు. నిరంజన్ కుమార్‌తో పాటు స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబుల్ కుమార్, స్కూల్ కరస్పాండెంట్ బత్తుల అనురాధ తదితరులు స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్సలను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ రూపానంది, అధ్యాపక బందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కెప్టెన్స్‌గా నియమితులైన విద్యార్థులతో నిరంజన్‌కుమార్ తదితరులు

ఉపాధి హామీని చిత్తశుద్ధితో అమలు చేయాలి

ప్రజా వేదికలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి-మునగపాక : ఉపాధి హామీ పథకాన్ని అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో అమలు చేయాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయ ఆవరణలో మంగళవారం జరిగిన ఎన్ఆర్ఇజిఎస్ సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. వలసలు నివారించి పేదలకు పని కల్పించే ఈ చట్టం ద్వారా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ జయలక్ష్మి, జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, దాడి ముసలి నాయుడు, మొల్లేటి సత్యనారాయణ, మల్ల కాళేశ్వరరావు, బొడ్డేడ అప్పలనాయుడు, కాళ్ళ చంద్రమోహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూలీల సమస్యలను పరిష్కరించాలి

ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదికలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో జరిగిన ప్రజా వేదికలో రికవరీ చేసిన మొత్తాన్ని వెంటనే కట్టించాలని, ఉపాధి హామీ కార్మికులకు ఎనిమిది వారాల బకాయిలు చెల్లించాలని కోరారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు మాట్లాడుతూ కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదం జరిగితే నష్టపరిహారం కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతు సంఘం నాయకులు ఎస్.బ్రహ్మాజీ మాట్లాడుతూ కూలీలకు పనిముట్లు అలవెన్స్, వేసవి అలవెన్స్ 40 శాతం అదనంగా చెల్లించాలని, ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని కోరారు.

ఉచిత కిడ్నీ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం చింత నిప్పుల అగ్రహారం, బగులువాడ, వేటజంగాల పాలెం గ్రామాలలో మంగళవారం ఉచిత కిడ్నీ సంబంధ సమస్యలపై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, అర్బన్ ఫైనాన్స్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ స్క్రీనింగ్ పరీక్షల కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ మొత్తం 11 గ్రామాలలో స్క్రీనింగ్ పరీక్షలు పూర్తయిన తర్వాత నెఫ్రాలజీ వైద్యులతో ప్రత్యేకమైన వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తుమ్మపాల, తగరంపూడి, కసింకోట పిహెచ్‌సిల వైద్యాధికారులు నీలిమారాణి, మేఘన వాణి, సుధాకర్ సీరం క్రేయటన్, బ్లడ్ షుగర్, హిమోగ్లోబిన్ బీపీ పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి హైమావతి, ఎండిఓ ఆశ జ్యోతి, సర్పంచులు ఎంపీటీసీలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెలుగు ఏపిఎం చిన్నబాబు

పంచాయతీల సహకారంతో పనిచేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : సామాజిక అవసరాలు తీర్చే విధంగా గ్రామపంచాయతీలు సహకారంతో గ్రామైక్య సంఘాలు పనిచేయాలని వెలుగు ఏపిఎం కె.చిన్నబాబు అన్నారు. సెర్ప్ కార్యాలయంలో గ్రామీణ సమృద్ధి వాస్తవిక ప్రణాళికపై మంగళవారం గ్రామైక్య సంఘాలకు ఒకరోజు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ గ్రామాల్లో పిఎం సూర్య ఘర్, ప్రకృతి వ్యవసాయం, స్త్రీ నిధి రుణాలు, బ్యాంకు రుణాలపై ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మండల సమైక్య అధ్యక్షురాలు ఆర్ యశోద, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రముఖ సామాజిక సేవకులు కాండ్రేగుల శ్రీరామ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ నగరం బీసీ హాస్టల్, డిఎన్టి హాస్టల్, సుభాష్ చంద్రబోస్ హాస్టల్, ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు ఇంగ్లీష్, తెలుగు, కాపీ రైటింగ్ బుక్స్‌తో పాటు పెన్నులు, బిస్కెట్స్ ప్యాకెట్, పంపిణీ చేశారురు. ఈ కార్యక్రమంలో చింతా లక్ష్మణరావు, బంగారం, కుంచా చిన్ను, ఉమా మహేష్, డొక్కరి మోహన్, జోరిగల శ్రీనివాస్, వెంకటేష్, హాస్టల్ వార్డెన్లు శ్రీనివాస్, రామయ్య, పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి ఎస్‌సి కాలనీలో గత రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్ ఎర్రంశెట్టి గోవింద వాపోయారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తురకలపూడి ఎస్సీ కాలనీ కొండ ప్రాంతానికి దగ్గరగా ఉందని, విద్యుత్ సరఫరా లేకపోవడంతో పాములు విష పురుగులో ఇళ్లల్లోకి వస్తున్నాయని వాపోయారు. వర్షాలు పడుతుండడంతో దోమల అధికంగా ఉందని, పిల్లలు బాలింతలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారాన్ని ఇచ్చిన వారు పట్టించుకోవడంలేదని వాపోయారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైసిపి నాయకుల అరెస్టు సరికాదు

ప్రజాశక్తి-చోడవరం : కూటమి ప్రభుత్వం వైసిపి నాయకులు, కార్యకర్తలను అక్రమ అరెస్టు చేయడం సిగ్గుమాలిన చర్య అని వైసిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్ అన్నారు. రాజమండ్రిలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాను అరెస్టు దారుణమన్నారు. ప్రజల తరపున ప్రశ్నిస్తున్న పార్టీ నాయకులను అరెస్టు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగిందని, దానిని కప్పిపుచ్చుకోవడానికి ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం దారుణమన్నారు.

బదిలీ సచివాలయ సిబ్బందికి వీడ్కోలు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని గొల్లలపాలెం పంచాయితీ సచివాలయ సిబ్బంది ఇటీవల బదిలీ కావడంతో, వారికి స్థానిక సర్పంచ్ మోపాడ అప్పారావు పంచాయితీ పాలకవర్గం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోపాడ అప్పారావు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొమ్ము కనకరాజు, కార్యదర్శి, పాలక వర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బదిలీ అయిన సచివాలయ సిబ్బందిని సత్కరిస్తున్న దృశ్యం

అదాని హైడ్రో పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా

24న బహిరంగ సభను జయప్రదం చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన గ్రామాల్లో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-దేవరాపల్లి

అదాని హైడ్రోపవర్ ప్లాంట్‌ను వ్యతిరేకిస్తూ ఈనెల 24న గురువారం మధ్యాహ్నం 2 గంటలకు చింతలపూడి పంచాయతీ కొత్తూరు జంక్షన్‌లో జరుగు బహిరంగ సభకు ప్రభావిత గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి దొర పిలుపునిచ్చారు. ఈ మేరకు చింతలపూడి, తామరబ్బ పంచాయతీల్లో మంగళవారం కరపత్రాలతో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదాని కంపెనీ 900 మెగావాట్లు సామర్థ్యం గల హైడ్రోపవర్ ప్లాంట్ నిర్మాణానికి చింతలపూడి, సమ్మెద, పల్లపు కోడాబు గ్రామాల్లో 600 ఎకారాలు, మారిక గ్రామంలో 213 ఎకారాలు భూమిని తీసుకుంటుందని తెలిపారు. అలాగే పెదకోట పంచాయతీ రేగులపాలెం ప్రాంతంలో 1800 మెగావాట్లు సామర్థ్యం గల ప్రాజెక్టు కట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ రెండు ప్రాజెక్టులు రైవాడ రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియా ఉన్నాయని, వీటి వల్ల రైవాడ ఆయకట్టు భూములు మొత్తం బీడు బారి పోతాయాయని పేర్కొన్నారు. అలాగే విశాఖకు తాగునీరు కరువైపోతుందన్నారు. రైవాడ ఆయకట్టు రైతులు గిరిజనులు చేస్తున్న పోరాటంతో చేతులు కలపాలని కోరారు. ఈనెల 24న మధ్యాహ్నం 2 గంటలకు చింతలపూడిలో జరుగు బహిరంగసభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసురావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, అనకాపల్లి, అల్లూరి, విజయనగరం జిల్లాల కార్యదర్శులు జి.కోటేశ్వరరావు, పి.అప్పలనర్స, టి.సూర్యనారాయణ, అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు వక్తలు పాల్గొంటారని తెలిపారు. ఈ బహిరంగ సభకు రైవాడ ఆయకట్టు రైతులు, నీటి సంఘాల చైర్మన్లు తరలిరావాలని పిలుపునిచ్చారు.

బహిరంగ సభ కరపత్రాలు చూపుతున్న గిరిజనులు, సిపిఎం నేతలు

భూసేకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలో పరిశ్రమల పేరుతో ప్రభుత్వం చేపట్టిన భూసేకరణను విరమించుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్‌వి.నాయుడు, సిఐటియు మండల నాయకులు పి.సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మల్లం, భూపతిపాలెం, ఆర్.శివరాంపురం, అప్పంపాలెం, ఆర్.భీమవరం తదితర గ్రామాల్లో మంగళవారం వారు పర్యటించి రైతులను నుండి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు భూములు ఇస్తే తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు చెబుతున్నారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఇదే భూములను నమ్ముకుని జీవిస్తున్నట్లు రైతులను రోడ్డు పాలు చేయొద్దని హితవుపలికారు.

ఆర్.భీమవరంలో నినాదాలు చేస్తున్న రైతులు

పోరాటం చేయాలి

మండలంలో సెజ్ ఏర్పాటుకు మల్లం పరిసర ప్రాంతాల్లో చేస్తున్న భూసేకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని జిల్లా రైతు కూలీ సంఘం కార్యదర్శి కోన మోహన్‌రావు అన్నారు. మండలంలోన ఆర్.భీమవరంలో మంగళవారం రైతులతో ఆయన సమావేశమయ్యారు. భూ సేకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం అని తీర్మానించారు. భూ సేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేస్తే రైతులు అభ్యంతరాలు తెలపవచ్చని చెప్పారు. భూసేకరణకు వ్యతిరేకంగా బుధవారం మల్లం, ఎం.భూపతిపాలెం, ఆర్.భీమవరం, ఆర్.శివరాంపురం, అప్పంపాలెం గ్రామాల నుండి రైతులు ప్రజాప్రతినిధులు ర్యాలీగా తరలి వెళ్లి బుచ్చయ్యపేట తహశీల్దారుకు వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు.

బుదిరెడ్లపాలెం పాఠశాలను సందర్శించిన ఎంఇఒలు

భవన నిర్మాణంపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం

ప్రజాశక్తి-వడ్డాది

మండలంలోని కోమల్లపూడి శివారు బుదిరెడ్లపాలెం పాఠశాలకు భవనం నిర్మించాలని చిన్నారులు దండాలు పెట్టి వేడుకోవడంపై పత్రికల్లో వచ్చిన వార్తలకు విద్యాశాఖ అధికారులు స్పందించారు. బుదిరెడ్లపాలెం పాఠశాలను ఎంఇఒ 1, 2లు కాశీ విశ్వేశ్వరరావు, బొంజి బాబు, సమగ్ర శిక్ష అభియాన్ సర్వేయర్ ప్రసాద్ మంగళవారం సందర్శించారు. ఆ పాఠశాలలో చిన్నారులు పడుతున్న కష్టాలు, ఇబ్బందులపై తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. బుదిరెడ్లపాలెం పాఠశాల భవనం శిథిలం కావడంతో గత ప్రభుత్వం హయాంలో నాడు-నేడు పథకం కింద కొత్త భవనం నిర్మాణం చేస్తామని, శిథిల భవనాన్ని తొలగించిన విషయం విధితమే. అయితే కొత్త భవన నిర్మాణం నేటికీ చేపట్టకపోవడంతో చిన్నారులకు మూడేళ్లలో కొన్నాళ్లపాటు అంగన్వాడీ కేంద్రంలోనూ, ప్రస్తుతం రేషన్ గొడౌన్‌లోనూ తరగతులు నిర్వహిస్తున్నారు. కనీస సదుపాయం లేకపోవడంతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనిపై విద్యార్థులు ఇటీవల తమకు కొత్త భవనం నిర్మించాలని దండాలు పెడుతూ నిరసన తెలిపారు. ఈ సమస్య పత్రికల్లో రావడంతో డిఇఒ అప్పారావు నాయుడు స్పందించి ఎంఇఒలను బుదిరెడ్లపాలెం పాఠశాలకు వెళ్లి పరిశీలించాలని ఆదేశించడంతో ఎంఇఒలు మంగళవారం పాఠశాలను సందర్శించారు. అక్కడి పరిస్థితిని స్వయంగా చూడటంతో పాటు గ్రామస్తులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. భవన నిర్మాణ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ యన్నంశెట్టి సత్యరావు, యన్నంశెట్టి సన్యాసినాయుడు, ఉటా శ్రీను, మాడిసి రమణ, శ్రీను, పోతునాయుడు, సత్తిబాబు, నాగేష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘన సత్కారం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదేళ్లపాటు తమ సేవలు అందించిన ఉపాధ్యాయులు బదిలీ కావడంతో వారిని మంగళవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎంగా పనిచేసిన రెడ్డి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు భీమవరపు వెంకటదేముళ్లు, బోజింకి శ్రీనివాసరావు, విజయలక్ష్మి, రాపర్తి పద్మావతి తదితరులు ఇతర పాఠశాలలకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో పాఠశాల ప్రాంగణంలో ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డిఎస్‌ఎస్‌వి.ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం శాలువాలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్దాడ వెంకటరమణ, శ్రీనివాసరావు, మహేష్, మాధవరావు, త్రినాథ్, కాండమ్మ, మశీహర్, సోములమ్మ, సుగుణ కుమారి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : తెలుగుదేశం ప్రభుత్వంతోనే రాష్ట్రానికి సుపరిపాలన సాధ్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పెంటకోట కళ్యాణ మండపంలో కార్యకర్తలు నాయకులతో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మంత్రి పాల్గొని మాట్లాడారు. టిడిపి నాయకులు పీలా గోవింద, దాడి వీరభద్రరావు, బత్తుల తాతయ్య బాబు, బుద్ధ నాగ జగదీష్, మళ్ళ సురేంద్ర, దాడి రత్నాకర్ పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని గంటవానిపాలెం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పెంటకోట విజయ్, భీమరశెట్టి శ్రీనివాసరావు, ఆడారి మంజు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలో అన్ని గ్రామాల్లోనూ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నాలుగు రోజుల్లో శతశాతం పూర్తి చేయాలని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు సూచించారు. మంగళవారం నక్కపల్లిలో మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి, వైబోయిన రమణ, పాల్గొన్నారు.

ఎఎస్‌ఐగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-బుచ్చయ్య పేట : బుచ్చయ్యపేట పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న పతివాడ సత్యనారాయణకు ఎఎస్‌ఐగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు మంగళవారం ఆయన విధుల్లో చేరారు. ఆయనకు ఎస్‌ఐ శ్రీనివాసరావు, అదనపు ఎస్‌ఐ భాస్కరరావు, అభినందనలు తెలిపారు.

ఘనంగా మోదకొండమ్మ పండగ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో మోదకొండమ్మ పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో కొలువై ఉన్న అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పసుపు, కుంకుమలు, చీర, జాకెట్లు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం దేవరాపల్లిలోని శ్రీసత్యసాయి బాబా మందిరం వద్ద ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్య బృందం నేత్ర పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో మొత్తం 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 20 మందిని కేటరాక్ట్ శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. మరో ఆరుగురిని విశాఖ శంకర్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ డాక్టర్ ఆర్.దుర్గ భావాని, కన్వీనర్ ఇట్ల వెంటపతి, వి. రామమణి, బి. మంగలక్ష్మి, సీహెచ్. దేవుడమ్మ, క్యాంప్ కోఆర్డినేటర్ సీహెచ్.అశ్వినీకుమార్, భాను పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ పిల్లలను పెంచాలి

ప్రజాశక్తి-కశింకోట : అంగన్వాడీ కార్యకర్తలు ప్రీ స్కూల్ పిల్లలను పెంచాలని ఐసిడిఎస్ సీడీపీఓ ప్రభావతి అన్నారు. మండలంలోని తాళ్ళపాలెం అంగన్వాడీ, మినీ కేంద్రాలను మంగళవారం ఆమె పరిశీలించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు ఆట పాటలు నేర్పించాలని సూచించారు. సూపర్ వైజర్ సుచిత్ర, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

నక్కపల్లిలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - చీడికాడ : గ్రామాల్లోని డ్రైనేజీలు, వీధుల్లో చెత్తాచెదారం, మురుగునీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టడం ద్వారా పారిశుధ్యం మెరుగునకు పంచాయతీ కార్యదర్శులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపిడిఒ చంద్రశేఖరరావు సూచించారు. దోమలు విజృంభించకుండా చర్యలు చేపట్టి, డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. మంగళవారం మండలంలోని శెట్టిపల్లి, చుక్కపల్లి, జి కొత్తపల్లి గ్రామాలలో పర్యటించి డ్రైనేజీలు, పారిశుధ్యాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు పడుతున్న తరుణంలో గ్రామాలలో డ్రైనేజీలో చెత్తాచెదారంతో పాటు నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వతో ఈగలు, దోమలు విజృంభించి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించి భాగస్వాములను చేయడంతోపాటు పంచాయతీపరంగా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.కార్యక్రమంలో కార్యదర్శి గోపి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు, వేంపాడు, జానకయ్యపేట గ్రామాల్లో ముమ్మరంగా చేపడుతున్న డ్రైనేజీల పూడికతీత, ఇతర పారిశుధ్య పనులను ఎంపిడిఒ సీతారామరాజు, డిప్యూటీ ఎంపిడిఒ చలపతిరావు మంగళవారం పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండాగ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

కోటవురట్ల : గ్రామీణ ప్రాంత ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ చంద్రశేఖర్ కోరారు. మంగళవారం లింగాపురం తంగేడు గ్రామాలలో పారిశుధ్యపనులను పరిశీలించారు, గ్రామంలో చెత్తను ఎప్పటికప్పుడు సంపద కేంద్రలకు తరలించాలని సిబ్బందికి ఆదేశించారు తాగునీటి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని సూచించారు, కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివప్రసాద్, రమణ, ఇఒపిఆర్‌డి కూర్మా రావు, కార్యదర్శి రఘురాం, నరసింహారావు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుపై
ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద వచ్చేనెల 6న నిర్వహించే బల్క్ డ్రగ్స్ పార్క్‌పై ప్రజాభిప్రాయ సేకరణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని, దీనిని వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో మత్స్యకారులతో కలిసి ప్రజాభిప్రాయ సేకరణపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నేత అప్పలరాజు మాట్లాడుతూ జనవరి 1న బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా విశాఖపట్నం వచ్చి వర్చ్యువల్‌గా బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారన్నారు అప్పటి నుంచి బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటును ఈ ప్రాంత ప్రజానీకం వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ప్రాణాలకు, మత్స్యకారుల జీవనోపాధికి నష్టం కలిగించే బల్క్ డ్రగ్స్ పార్కును ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయొద్దని డిమాండ్ చేశారు.కాకినాడ జిల్లా, తొండంగి ప్రాంతంలో అక్కడ ప్రజలు బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తే, కూటమి ప్రభుత్వం కేంద్ర బిజెపి ప్రభుత్వంతో కలిసి నక్కపల్లిలో రాజయ్యపేట ప్రాంతంలో ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సముద్ర తీరాన్ని డంపింగ్ యార్డ్‌గా మార్చి మత్స్యకారుల మనగడకే ప్రమాదం వచ్చే విధంగా కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు.

గ్రామసభలు పెట్టి, ప్రజలు, మత్స్యకారుల యొక్క అభిప్రాయం మేరకే పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర హోంశాఖమంత్రి వంగలపూడి అనిత తెలిపారని, ఈలోగా బల్క్‌డ్రగ్స్ పార్క్‌పై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టేందుకు సన్నహాలుచేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సిపిఎం శాఖా కార్యదర్శి ఎం.మహేష్ బాబు, జీ.కాశీరావు, కోడా కాశీరావు, కారే భూలోక, బొంది నూకరాజు, మైలపల్లి కాశీ,కారే కాశీరావు, కాలే లక్ష్మి, ఎరిపల్లి సత్తియ్యమ్మ, అర్జిల్లి వెంకటేష్, మైలపల్లి దేముడు, సూదుల సింహాచలం పాల్గొన్నారు.

మత్స్యకారులతో కలిసి మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ గాయత్రి, వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-గొలుగొండ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని మండలంలోని సీహెచ్.నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురామ చంద్రరావు తెలిపారు. మంగళవారం కృష్ణదేవిపేట పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ గాయత్రి ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులన పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వరాలు ప్రబలకుండా, వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ గాయత్రి ప్రజలకు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వానా కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీరు నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తద్వారా దోమలు నియంత్రించి, సీజనల్ జ్వరాలు దరిచేరకుండా చూడొచ్చన్నారు.

వరి సాగు, సస్యరక్షణపై అవగాహన



వరి నారుమళ్ల సస్యరక్షణపై సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

ప్రజాశక్తి -నక్కపల్లి : వరి నారుమళ్లలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి బి మోహనరావు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలో ఒడ్డిమెట్ట, గొడిచెర్ల గ్రామాల్లో పొలం పిలుస్తుంది' కార్యక్రమంలో భాగంగా స్థానిక అధికారులతో కలిసి ఆయా గ్రామాల్లోని వరి నారుమళ్లను పరిశీలించారు.

వరి నారుమళ్లలో ముందు జాగ్రత్తగా ట్రైకోడెర్మా లేదా సుడోమోనాస్ వాడడం ద్వారా తెగుళ్లు రాకుండా నివారించవచ్చునని రైతులకు సూచించారు. ట్రైకోడెర్మా పొడిమందును పశువుల గెత్తంలో కలిపి వాడే విధానాన్ని రైతులకు ప్రదర్శించి చూపించి అవగాహన కల్పించారు. బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ పొడ తెగులు ఆశించిన తర్వాత మందులు వాడడం కన్నా, వరి నారుమళ్లు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ముందు జాగ్రత్తగా తగు చర్యలు చేపట్టడ ఉత్తమమన్నారు. పొడ తెగులు రాకుండా హెక్సకోనజోల్ 20 మిల్లీలీటర్లు లీటర్‌కు కలిసి పిచికారీ చేయాలన్నారు. స్థానిక వ్యవసాయ అధికారి కే.ఉమా ప్రసాద్ మాట్లాడుతూ నారుమళ్లలో కలుపు నియంత్రణకు 20- 25 రోజుల వయస్సున్న మడిలో బిస్ పైరిబ్యాక్ సోడియం కలుపు మందును 10 లీటర్ల నీటికి 4 మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారి సత్యనారాయణ, రైతు సేవ కేంద్రం సిబ్బంది నాగేశ్వరరావు, రాము, రజని, శిరీష, రైతులు పాల్గొన్నారు.

యలమంచిలి : ఆధునిక వ్యవసాయ పరికరాల ద్వారా సాగు చేస్తూ పెట్టుబడులు తగ్గించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు అన్నారు. మండలంలోని రామారాయుడుపాలెంలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు జాహ్నవి, మండల వ్యవసాయాధికారి మోహనరావు, శాస్త్రవేత్తలు భావాని, కుమారి, నాగేంద్ర, నూకరాజు, వ్యవసాయ సహాయకులు స్వాతి, అరుణ, దీపిక , రైతులు పాల్గొన్నారు.

కశింకోట : రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి సాగు ఖర్చు తగ్గించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి స్వప్న అన్నారు. మండలంలోని చరకం, తీడ గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కుంద్రపు అరుణ, వ్యవసాయశాఖ సిబ్బంది వి.ఎ.కిషోర్, రైతులు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని గోరపూడి, వెల్చూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సి.సుమంత, సిబ్బంది శ్రీనివాస్, కుమారి, హేమ, కనకరత్నం, కోటేశ్వరరావు, విఎఎ, రైతులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని తారువ గ్రామంలో మంగళవారం 'పోలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్.వై.కాంతమ్మ, టిడిపి నాయకులు అల్లు సరోజ శ్రీనివాసరావు, ఎం.మహాలక్ష్మీ నాయుడు, బి.సూర్యనారాయణ, ఏఈఓ కిరణ్, వీఏఏ కె.దేవి, ఎం. బాలు పాల్గొన్నారు.

సచివాలయ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని రాజయ్యపేట సచివాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని పంచాయతీ వార్డు సభ్యుడు మైలపల్లి మహేష్ బాబు కోరారు. ఈ మేరకు మంగళవారం పంచాయతీ కార్యదర్శి సత్యానికి వినతిపత్రం అందజేసి, జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో రాజయ్యపేట సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్ పోస్టులను నియమించలేదని, దీని కారణంగా సచివాలయ సేవలు పూర్తిస్థాయిలో అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు చొక్కా కాశీ, మైలపల్లి శివాజీ, సూదుల రమణ, ఎం.అప్పారావు, కె.తాతాజీ, సిహెచ్ శివ, డి.సూరిబాబు పాల్గొన్నారు.

బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా రత్నభరత్

ప్రజాశక్తి- పాయకరావుపేట : బిజెపి అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాయకరావుపేటకు చెందిన దంత వైద్యులు డాక్టర్ బొల్లవరపు రత్న భరత్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. రత్నభరత్ గతంలో యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా, పిఎం జెకెకెవై రాష్ట్ర అధికార ప్రతినిధిగా పని చేశారు రత్న భరత్‌కు పదవి రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పశువులకు వ్యాక్సినేషన్

వ్యాక్సినేషన్ చేస్తున్న పశువైద్యులు

ప్రజాశక్తి- చీడికాడ : థైలేరియా వ్యాక్సినేషన్ పాడి రైతులందరూ వినియోగించు కోవాలని పశు వైద్య అధికారి డాక్టర్ గణేష్ రెడ్డి సూచించారు. మంగళవారం అప్పలరాజుపురం గ్రామంలో లలితా దేవి ఆశ్రమంలో పశువలకు థైలేరియా వాక్సినేషన్ చేపట్టారు. పిరుదులు ద్వారా పశువులకు ఈ వ్యాధి సంక్రమిస్తుందని, అధిక జ్వరం, పాల దిగుబడి తగ్గిపోవడం వంటి లక్షణాలుంటాయన్నారు. మూడు నెలల నుంచి ఆరునెలల చూడి ఉన్న ఆవులకు మాత్రమే ఈ వ్యాక్సిన్ వేయాలని సూచించారు. ఆశ్రమం నిర్వాహకురాలు యాళ్ళ వెంకట్ లక్ష్మి, పశుసంవర్ధక సహాయకులు మోర్తా శ్రీనివాసరావు, పాడిరైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి-కోటవురట్ల : సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పిహెచ్‌సి వైద్య సిబ్బంది ఉపాధ్యాయులను కోరారు, మంగళవారం కొడవటిపూడి జెడ్‌పి పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు, ఈ సందర్భంగా విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని, వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతోపాటు హ్యాండ్‌వాష్ చేసుకుంటుండాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహారం భుజించాలని సూచించారు, కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రతాప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒకు అభినందన

ఎంఇఒను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలో ఎంఇఒ-2గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీరామ్మూర్తి మంగళవారం ధర్మవరం అగ్రహారం పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా ధర్మవరం అగ్రహారంలో పిఆర్‌టియు ఉపాధ్యాయులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సైతారుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలంతో అభినందించారు. కార్యక్రమంలో ధర్మాన అగ్రహారం, సైతారు పేట పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లికి వందనం అమలుకు ఆందోళన

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు

ప్రజాశక్తి -నక్కపల్లి : పాఠశాలలు, కాలేజీల్లో కొత్తగా ప్రవేశాలు పొందిన ఒకటవ తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు వెంటనే తల్లికి వందనం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం బాలాజీ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వజూనియర్ కళాశాల నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన ర్యాలీ చేపట్టారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. అనంతరం డిటి నారాయణరావుకు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలాజీ మాట్లాడుతూ ఈనెల 10 నాటికి ఒకటవ తరగతి, ఇంటర్ విద్యార్థుల తల్లుల ఖాతాలకు తల్లికి వందనం అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, అయితే నేటికీ అమలు చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. తల్లికివందనం పోర్టల్లో చెక్ చేస్తే ఎలిజిబుల్ లిస్టులో పెయిడ్ అని చూపిస్తుందని, కానీ అకౌంట్లో డబ్బులు జమ కాలేదన్నారు ప్రభుత్వం వెంటనే స్పందించి తల్లికి వందనం నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు.

డిగ్రీ కాలేజీకి భవనం సమకూర్చండి

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం సమకూర్చాలని కోరారు. సొంత భవనం లేని పరిస్థితుల్లో స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో డిగ్రీ తరగతులు బోధిస్తున్నారని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడక తప్పడం లేదన్నారు. వెంటనే డిగ్రీ కాలేజీకి సొంత భవనాలను సమకూర్చాలన్నారు. బయాలజీ, హిందీ, పిఇటి పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో విద్యార్థులు ఇబ్బందులు పడడం బాధాకరమని, దీనిపై హోంమంత్రి దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుంటే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తాతాజీ, రాము, కార్తీక్, రాజేష్, రూస్సీ, భవాని, లక్ష్మి, శ్రీనిజ పాల్గొన్నారు.

కారిడార్ పనుల పరిశీలన

వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి - నక్కపల్లి : మండలంలో వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్లో భాగంగా పరిశ్రమల స్థాపనకు జరుగుతున్న పనులను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. బల్క్ డ్రగ్స్, స్టీల్ప్లాంట్ ఏర్పాటుకు ఎపిఐఐసి సేకరించిన భూముల్లో మౌలిక వసతులు కల్పనలో భాగంగా రోడ్లు, ఇతర నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఆయా పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ప్రస్తుతం ఎంతవరకు వచ్చాయో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రహదారి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు అదనంగా సేకరించనున్న భూములను పరిశీలించారు. తీర ప్రాంతాల్లో గుర్తించకుండా వదిలేసిన ప్రభుత్వ భూములను గుర్తించి, వివరాలను అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. బోదుగల్లం లేఅవుట్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో ఆర్డిఓ వివి రమణ, తహసిల్దారు నరసింహమూర్తి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కూటమి నేతలకు గుణపాఠం తప్పదు

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నియోజకవర్గంలో వైసిపి నాయకులు, కార్యకర్తలపై క్రమ కేసులు పెట్టడం, ఇల్లు కూలగొట్టడం వంటి చర్యల ద్వారా టిడిపి నాయకులు తమకు కొత్త పాఠాలు నేర్పుతున్నారని, తాము అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే నేర్చుకున్న పాఠాలన్నీ అప్పచెబుతామని, కూటమి నేతలకు గుణపాఠం చెబుతామని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ హెచ్చరించారు. 2029లో జగనన్న సునామీ రాబోతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. మంగళవారం నర్సీపట్నం మున్సిపాలిటీ వైసిపి విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ తాను గతంలోలా ఉండబోనని,తనలో 2.0 చూస్తారన్నారు. ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని, పోరాటాలు చేస్తే అణచివేస్తున్నారని, ఆయినా ప్రజల పక్షాన పని చేస్తామన్నారు. చంద్రబాబు మోసాలపై జరిగిన నష్టంపై ప్రత్యేక ఫార్మెట్లో ప్రజల నుంచి వివరాలను సేకరించాలన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో రెడ్బుక్ రాజ్యాంగం, నియోజకవర్గంలో రాక్షసపాలన సాగుతోందన్నారు. రాయి క్వారీల్లో ట్రాక్స్ పనులు చేస్తున్నారన్నారు. నర్సీపట్నంలో ఎవరు పోటీచేసినా వైసిపిదే గెలుపు అన్నట్లుగా పార్టీ బలోపేతం కావాలన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షులు ఏకా శివ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ ఛైర్పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మీసాల బాబు పాల్గొన్నారు.

'పి4'పై శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపిడిఓ డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపిడిఓ చలపతిరావు ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు పి 4పై శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని, శానిటేషన్పై దృష్టి సారించాలని సూచించారు.

క్వారీ అనుమతులు రద్దు చేయాలి

• విజిలెన్స్ అధికారులకు స్పష్టం చేసిన ఫిర్యాదుదారులు

కోడూరు క్వారీని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రజాశక్తి- కోటవురట్ల : మాకవరపాలెం మండలం కోడూరు వద్ద నల్లరాయి క్వారీ అనుమతులను రద్దు చేయాలని ఫిర్యాదుదారులు మరోమారు స్పష్టం చేశారు. మంగళవారం విజిలెన్స్, మైనింగ్ అధికారి అశోక్ కుమార్ పరిశీలించారు. క్వారీలో అక్రమాలపై పత్రికల్లో వార్తలతోపాటు స్థానికులు కలెక్టర్ కార్యాలయంలో చేసిన ఫిర్యాదులపై అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో కోడూరు గ్రామంలోని క్వారీని అశోక్కుమార్ పరిశీలించి, క్వారీ నిర్వహణపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. నల్లరాయి క్వారీతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై వారిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. భారీ పేలుళ్లతో భయాందోళనలకు గురవుతున్నామని, వృద్ధులు చిన్నారులు సహా పశువులు కూడా బెదిరిపోతున్నాయని స్థానికులు వివరించారు. క్వారీ కాలుష్యంతో ప్రజలకు రోగాలతోపాటు పరిసరాలు కాలుష్యమయమౌతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్లో క్వారీ కష్టాలపై ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు బొంతు రమణ మాట్లాడుతూ తక్షణమే క్వారీ అనుమతులు రద్దు చేసి, నిలిపేయాని అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామీణ సమృద్ధి ప్రణాళికపై శిక్షణ

మాట్లాడుతున్న వెలుగు ఎపిఎం శ్రీనివాసరావు

ప్రజాశక్తి -నక్కపల్లి : గ్రామీణ సమృద్ధి స్థాపక ప్రణాళికపై స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు ఎపిఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ సంఘాల అధ్యక్షులు, విఒఎలు, సిఆర్పిలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన శిక్షణలో ఎపిఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ పొదుపు సంఘాల అవసరాలు, జీవనోపాధి పెంపుదల మొదలగు అంశాలపై గ్రామ సంఘాల సమావేశంలోనే యాప్లో నమోదు చేయాలని సూచించారు. పబ్లిక్ ఆస్తులు, సేవల, వనరుల అభివృద్ధి ప్రణాళిక, సామాజిక అభివృద్ధి ప్రణాళికలను గ్రామసంఘం స్థాయిలో అందరి భాగస్వామ్యంతో గ్రామ సంఘ అవసరాలు, గ్రామాభివృద్ధికి సామాజిక అవసరాలను తీర్చే విధంగా గ్రామ పంచాయితీ ఆమోదంలో కార్యదర్శి సహకారం తీసుకొని శతశాతం యాప్లో నమోదు చేయాలని సూచించారు..సముద్ర నాచు, పశు గ్రాసం, సూర్యఘర్ రూఫ్ టాప్ కనెక్షన్స్, ప్రకృతి వ్యవసాయం, స్త్రీనిధి రుణాలు తదితర అంశాలపై ఆయా శాఖల ఉద్యోగులు మాట్లాడారు. ఎపి సిఎన్ఎఫ్ సిబ్బంది అప్పారావు, ఎంఎంఎస్ అధ్యక్షులు కె.అనంతలక్ష్మి, కార్యదర్శి మాధురి, కోశాధికారి తేజ, సిసిలు రాజు, అప్పారావు, కోటి, నాగ ప్రసాద్, దేవేనమ్మ, శ్రీను పాల్గొన్నారు

బీమా పరిహారం చెక్కుల పంపిణీ

చెక్కులను అందజేస్తున్న బ్యాంకు మేనేజరు రాజ్ కుమార్

ప్రజాశక్తి - పాయకరావుపేట : పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మెయిన్ బ్రాంచిలో మంగళవారం ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, సురక్ష యోజన పథకంలో లబ్ధిదారుల నామినీలకు బీమా చెక్కులను బ్రాంచి మేనేజరు రాజ్ కుమార్ అందజేశారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకంలో రాజవరం గ్రామానికి చెందిన కొవిరి యల్లయమ్మ, పాయకరావుపేటకు చెందిన మామిడి ఈశ్వరమ్మలకు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో పాయకరావుపేటకు చెందిన షేక్ గౌస్య, కురుమళ్ల నేస్తాలమ్మకు బీమా పరిహారం చెక్కులను అందజేశారు.

విద్యార్థి దశ నుంచే / నాయకత్వ లక్షణాలు అవసరం

కెప్టెన్స్గా ఎంపికైన శ్రీప్రకాష్ విద్యార్థులతో ఎన్సిసి కమాండెంట్ హరీందర్సింగ్

ప్రజాశక్తి- పాయకరావుపేట : విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని 3వ ఆంధ్రా ఎన్సిసి బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ హరీందర్సింగ్ మానిక్ అన్నారు. మంగళవారం శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో స్కూలు కెప్టెన్, హౌస్ కెప్టెన్ల ప్రమాణ స్వీకారోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థులు చదువుకునే వయస్సులో బాధ్యతగా వ్యవహరించాలని, ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించుకోవచ్చన్నారు. మంచి పౌరులుగా మారేందుకు నాయకత్వ లక్షణాలపై పట్టు సాధించాలన్నారు. విద్యార్థి దశలో నేర్చుకున్న చక్కని క్రమశిక్షణ వారి జీవితానికి బాసటగా నిలుస్తుందన్నారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ప్రకాష్ మాట్లాడుతూ, విద్యార్థులు ఎవరి భవిష్యత్తుకు వారే మార్గదర్శకులని, నాయకత్వం వహించడమంటే బాధ్యత తీసుకోవడమేనన్నారు. విద్యార్థి దశలో బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తే భవిష్యత్తులో ఎవరికీ జవాబుదారిగా ఉండాల్సిన అవసరం లేదన్నారు. దేశానికి కావాలసిన నాయకత్వ లక్షణాలను విద్యార్థి దశ నుంచి పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించగా, ముఖ్య అతిథి గౌరవ వందనాన్ని స్వీకరించారు ఎంపికైన విద్యార్థులతో నాయకత్వ లక్షణాలను సక్రమంగా నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్ మూర్తి, హెచ్ఎం ఎం.అపర్ణ, దాసరి శ్రీనివాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.